క్లుప్తంగా

మధ్యవర్తిత్వంపై అవగాహన పెంపొందించుకోవాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి సురేష్‌బాబు

భీమవరం: మధ్యవర్తిత్వంపై న్యాయవాదులు అవగాహన పెంపొందించుకుని కక్షిదారులకు మధ్యవర్తిత్వం ప్రాముఖ్యతను తెలియజేయాలని భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి సురేష్‌బాబు అన్నారు. మధ్యవర్తిత్వంపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం జడ్జి సురేష్‌బాబు అధ్యక్షతన మీడియేషన్ న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మీడియేషన్ న్యాయవాదులు స్టీఫెన్‌బాబు, విజయలక్ష్మి, ప్యానల్ న్యాయవాదులు సురేష్‌కుమార్, సుధీర్, అంబేడ్కర్, జ్యోతి, భవాని, లోకేష్, రవికిరణ్, పారా లీగల్ వలంటీర్లు సత్యనారాయణరాజు, నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంహెచ్‌పీ ప్రోగ్రాంపై శిక్షణ



ఎన్‌ఎంహెచ్‌పీ ప్రోగ్రాంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ-సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధనలక్ష్మి పర్యవేక్షణలో జిల్లాలోని స్టాఫ్ నర్సులకి, స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి ధనలక్ష్మి మాట్లాడుతూ ఒత్తిడిని తగ్గించుకోవడం ద్వారా మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.మాధవి కల్యాణి, జిల్లా ఏపీడీఎ మియోలోజిస్ట్ సుభాష్ , సైకాలజిస్ట్ శ్రీనివాస్, ఫిజియోథెరపిస్ట్ డా.రహీమ్, సోషల్ వర్కర్ సుమన్, ఎఫ్.ఎల్.సి గణేష్ పాల్గొన్నారు.

రోగులకు భోజనం ప్యాకెట్ల పంపిణీ

ఆకివీడు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రలోని వంది మంది రోగులకు గోకరాజు గంగరాజు సేవా ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు నేరెళ్ల పెద బాబు భోజనం ప్యాకెట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

డీఎన్నార్ కళాశాలలో ఉచిత రక్తదాన శిబిరం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: విద్యార్థులకు చదువుతోపాటు సామాజిక భాధ్యత కూడా తెలిసే విధంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు భీమవరం డీఎన్నార్ కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటుచేసిన ఉచిత రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఏటా తమ కళాశాలలో అనేక పర్యాయాలు రక్త దాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

21న పుస్తకాల పంపిణీ

భీమవరం: భీమవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 21న ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బొండా రాంబాబు, అల్లు తులసి ప్రసాద్ చెప్పారు. సోమవారం నిర్వహించిన క్లబ్ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ఆగస్టు నెలాఖరున భీమవరం ఫెమినా లయన్స్ క్లబ్ కమిటీ ప్రమాణ స్వీకారం నిర్వహిస్తున్నామని, దాని ద్వారా ప్రతి నెలా ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌లను నిర్వహించడానికి సమావేశంలో తీర్మానించినట్లు చెప్పారు.

గాదిరాజు సుబ్బరాజుకు పితృవియోగం



వెంకట్రామరాజు (ఫైల్)

భీమవరం: పట్టణంలోని అల్లూరి సీతారామరాజు సేవా సమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు తండ్రి గాదిరాజు వెంకట్రామరాజు (84) సోమవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని మంగళవారం బంధుమిత్రుల సందర్శనార్థం స్థానిక ఏఎస్‌ఆర్ నగర్ టీవీ టవర్ రోడ్డులో గల సుబ్బరాజు నివాసం వద్ద ఉంచుతారని, అనంతరం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

అప్పుల కోసం అన్నదాతల తిప్పలు

- పెట్టుబడి సాయం అందించని కూటమి ప్రభుత్వం
- పంటల బీమా సైతం రైతులే భరించాల్సిన దుస్థితి
- రుణాలు చెల్లిస్తేనే కొత్త రుణాలంటున్న బ్యాంకులు
- బంగారంపై రుణాలకు అదే తంతు
- దిక్కుతోచని స్థితిలో రైతన్నలు



ఖరీఫ్ వరి సాగులో దమ్ము చేస్తున్న రైతు

ఆకివీడు: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతన్నపై కూటమి ప్రభుత్వం కనికరం చూపడం లేదు. అన్నదాత సుఖీభవ పథకం కింద అందిస్తానన్న పెట్టుబడి సాయాన్ని రెండేళ్ల అందించకపోగా పంటల బీమా సైతం రైతులే చెల్లించాలని ప్రకటించడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి సాయం కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితిపై వారు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపు

ఖరీఫ్ సాగుకు పెట్టుబడుల కోసం రైతులు ఎదురు చూడాల్సి వస్తుంది. రైతు భరోసా సొమ్ము ఇంతవరకూ అందకపోవడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి. అయితే సొసైటీల ద్వారా రుణాలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. రబీ రుణం చెల్లిస్తేనే ఖరీఫ్‌కు రుణం ఇస్తున్నారు. సొసైటీల ఆధునీకీకరణలో భాగంగా అన్ని సొసైటీలు డిజిటలైజేషన్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో సొసైటీలు నడుస్తున్నాయి. దీంతో అప్పు చెల్లించిన తరువాతే తిరిగి అప్పు ఇస్తున్నారు. గతంలో వడ్డీ చెల్లించి, అప్పును తిరగరాసేవారు. ప్రస్తుతం ఆవిధానం లేకపోవడంతో అప్పు తీర్చడానికి రైతులు మళ్లీ అప్పు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. బంగారంపై రుణాల సంగతి కూడా అదే పరిస్థితి. ఏడాదిలో తిరిగి రుణం మొత్తం వడ్డీతో సహా చెల్లించాల్సి వస్తుంది. గతంలో రుణానికి వడ్డీ చెల్లించి, అప్పును తిరగరాసేవారు. ప్రస్తుతం మొత్తం రుణ సొమ్ము చెల్లించిన తరువాతే, తిరిగి రుణం ఇవ్వడం వల్ల రైతులు భారీ మొత్తంలో అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

తప్పని ప్రీమియం చెల్లింపు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులకు సకాలంలో రైతు భరోసా సొమ్ము వారి ఖాతాల్లో జమ చేసేవారు. సొసైటీల్లో, జాతీయ బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు త్వరితగతిన మంజూరు అయ్యేవి. పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించేది. ప్రస్తుతం ప్రీమియంను రైతులే చెల్లించాల్సి వస్తుంది. ఈ ఏడాది ఖరీఫ్ పంటకు ఆగస్టు 15లోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ప్రీమియం చెల్లించడానికి రైతు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఎకౌంటుతో పాటు, ఈ-క్రాప్‌నమోదును ఆర్‌ఎస్కేల వద్ద నుంచి తీసుకుని ప్రీమియం చెల్లించాల్సి ఉంది. దీంతో కొందరు రైతులు ప్రీమియం చెల్లించేందుకు ముందుకు రావడంలేదు. ప్రభుత్వ విధానంతో ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది.

రబీలో పంటల బీమా ప్రీమియం వివరాలు

మండలం	ఎకరాలు	రైతులు	రబీలో ప్రీమియం చెల్లించిన రైతులు
ఆకివీడు	4,100	2,150	1,650
ఉండి	18,880	3,956	2,900
కాళ్ళ	3,900	1,977	1,450
పాలకోడేరు	10,400	4,566	3,100

సర్వే నెంబర్ యూనిట్‌గా నష్టపరిహారం

ప్రీమియం చెల్లించిన రైతులు ప్రకృతి వైపరీత్యాలకు గురై పంట నష్టపోతే, గ్రామం యూనిట్‌గా వరి రైతులకు నష్టపరిహారం ఇస్తున్నారు. అది కూడా దిగుబడి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. దీనివల్ల పూర్తిగా నష్టపోయిన రైతులకు పూర్తి న్యాయం జరగడంలేదు. ప్రీమియం చెల్లించిన రైతు సర్వే నెంబర్ ప్రకారమే నష్టపరిహారం ఇవ్వాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇన్సూరెన్స్ కంపెనీల లబ్ధికోసమే గ్రామం యూనిట్ చేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు.

సర్వే యూనిట్‌గా బీమా



ప్రీమియం చెల్లించిన రైతులకు న్యాయం జరగాలంటే సర్వే నెంబర్ ఆధారంగానే నష్టపరిహారం, బీమా చెల్లించాలి. గ్రామం యూనిట్‌గా చేడయం వల్ల నష్టపోయిన రైతులకు పూర్తి న్యాయం జరగడంలేదు. ర్యాండమ్ సర్వే వల్ల మరింత నష్టం జరుగుతోంది. ప్రభుత్వాలు రైతుల్ని ఆదుకునేందుకు సర్వే నెంబర్ ఆధారంగా బీమా చెల్లించాలి.

– మల్లారెడ్డి శేషమోహనరంగారావు, భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి



పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించాలి. కౌలు రైతులకు ప్రీమియం చెల్లించే విధానం లేక కొందరు రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వం ప్రీమియం చెల్లించినట్లుగా కూటమి ప్రభుత్వం ప్రీమియం చెల్లించి రైతుల్ని ఆదుకోవాలి. అన్నదాత సుఖీభవ సొమ్ము వెంటనే చెల్లించాలి.

– నున్న గణపతి, కౌలు రైతు, సిద్ధాపురం, ఆకివీడు మండలం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ల: కాళ్ళ మండలం బోస్ కాలనీ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ స్కీములో భాగంగా నూతన 11 కేవీ లైన్ ఏర్పాటు పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. బోస్ కాలనీ, కలవపూడి, మోడి, మాలవానితిప్ప, గోగుతిప్ప, ఆనందపురం, ఇస్కుల్లంక, మేకలదిబ్బ, గూట్లపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయాలను గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆకివీడు: కోళ్లపర్రు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ సిద్ధాపురం ఫీడర్‌లోని లైన్ల క్లియరెన్స్ నిమిత్తం మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. కోళ్ళపర్రు, రాజులపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఆక్వా రైతులు, వినియోగదారులు గమనించాలన్నారు.

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని పెదగరువు విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో మంగళవారం 11 కేవీ శ్రీరామపురం, పెదగరువు వెళ్లే ఫీడర్లకు సంబంధించి ఆర్‌డీ ఎస్ఎస్ పనుల నిమిత్తం చెట్లు, కొమ్మలు తొలగించుట కొరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. పెదగరువు, రాజుల గరువు, వెంప, శ్రీరామపురం, శివన్నారాయణపురం గ్రామాలతో పాటు ఆక్వా లైన్లకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఐటీఐ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఉండి: ఈ నెల 20వ తేదీలోగా ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో రెండవ విడత ఐటీఐ సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్, ఐటీఐ జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకుని రసీదు పొందాలని, ఆ రసీదును ఈ నెల 24వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే కౌన్సిలింగ్‌లో తప్పనిసరిగా చూపించాలన్నారు. వివరాలకు 08816 297093, 96760 99988 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రిజిస్ట్రార్ ఆఫీసుపై ఆరోపణలకు ఖండన

ఉండి: గత కొద్దిరోజులుగా ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపైనా, అధికారులపైనా కృష్ణాజిల్లా చినగొల్లపాలెం గ్రామానికి చెందిన ఏలూరి రంగబాబు అనే వ్యక్తి తన ఆస్తులకు సంబంధించి అక్రమ రిజిస్ట్రేషన్ చేస్తున్నారంటూ చేస్తున్న ఆరోపణలను ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ శరాబంధురాజు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. రంగబాబు లేదా వారి కుటుంబీకులకు చెందిన ఎటువంటి ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయడం లేదన్నారు. రంగబాబు ఆరోపణల్లో వాస్తవాలు లేవని, ఆరోపణలు మానుకోకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

పాలకోడేరు: వ్యాన్ ఢీకొట్టడంతో మోటార్ సైక్లిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గణపవరం మండలం కాశీపాడుకు చెందిన ఇసుకపాటి సువర్ణరాజు సోమవారం ప్రార్థనలకు వెళ్ళి తిరిగి ఇంటికి బైక్‌పై వెళ్తుండగా గరగపర్రులోని పెట్రోల్ బంకు దగ్గరకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు భార్య రత్నకుమారి 108 అంబులెన్స్‌లో సువర్ణరాజుని భీమవరం హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఎస్.హరిబాబు తెలిపారు.

21న వికలాంగ నిర్ధారణ పరీక్షలు

పెనుగొండ: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు అందించడానికి అర్హత నిర్ధారణ పరీక్షలు ఈ నెల 21న నిర్వహించనున్నట్లు ఆచంట ఎంపీడీఓ బి.కృష్ణమోహన్ సోమవారం తెలిపారు. ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర మండలాల్లోని దివ్యాంగులు పెనుగొండ పంచాయతీలో 21న నిర్వహించే శిబిరంలో అర్హత నిర్ధారణ పరీక్షలకు హాజరు కావాలన్నారు. దివ్యాంగులు శిబిరానికి ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలని కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమావేశం



చినమిల్లి వెంకటరాయుడు

భీమవరం: బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంపై చర్చించేందుకు మంగళవారం భీమవరం నియోజవకర్గ వైఎస్సార్ సీపీ సమావేశం ఏర్పాటు చేసినట్లు నియోజవకర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు చెప్పారు. భీమవరం మండలం రాయలం గ్రామంలో నిర్వహించే పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు హాజరవుతారన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వెంకటరాయుడు కోరారు.

బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమానికి తరలిరావాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు పిలుపు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి పీవీఎల్

కాళ్ల: నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 17వ తేదీన తలపెట్టిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు పిలుపునిచ్చారు. పెద అమీరం పార్టీ క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బూటకపు హామీలు ఇచ్చి ఇంటింటికీ మేనిఫెస్టో బాండ్లు పంపిణీ చేసిన కూటమి ప్రభుత్వం ప్రజల్ని నమ్మించి మోసం చేసిందని అన్నారు. దీంతో గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పాలనను ప్రజలు గుర్తుకు తెచ్చుకుంటున్నారని అన్నారు. మరలా ప్రజలకు సుపరిపాలన అందాలంటే వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికు సాధ్యమని స్పష్టం చేశారు. పెదఅమిరం గ్రామంలో జరగనున్న బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బొత్స సత్యనారాయణ, ముదునూరి ప్రసాదరాజు, కారుమూరి నాగేశ్వరరావు కొరు శ్రీనివాస్ వంటి సీనియర్ నాయకులు పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొండేటి శివకుమార్, గణేశ్న రాంబాబు పెనుమత్స ఆంజనేయరాజు, నంద్యాల సీతారామయ్య, బొచ్చ అచ్చారావు, వేగేశ్న జయ రామకృష్ణంరాజు, సుంకర భోగేశ్వరరావు, గలవెల్లి ధనుంజయ్, శ్రీహరి రాజు, సాగిరాజు హరి వర్మ, చెల్లబోయిన పాపారావు, చేకూరి నరేంద్ర, అంబటి రమేష్, నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మూర్తిరాజు మృతి అత్యంత బాధాకరం

భీమవరం: ఎస్ఎల్‌డీటీ ట్రైనింగ్ ప్రోగ్రాం రిసోర్స్ పర్సన్‌గా నియమించబడి తాడేపల్లిగూడెం నందు ట్రైనింగ్ కొరకు హాజరైన అరట్లకట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఆర్ మూర్తి రాజు మృతి చెందడం అత్యంత బాధాకరమని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ సాయి శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారు. అనారోగ్య కారణం చూపినప్పటికీ వారిని విధులకు హాజరు కావాలని అధికారుల ఉత్తర్వులు ఇవ్వడం అత్యంత దారుణమన్నారు. దీనికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే ఉపాధ్యాయులు అత్యంత ఒత్తిడితో విధులకు హాజరవుతున్నారని, ఇటువంటి తీవ్రమైన ఒత్తిడి చేస్తే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి గతం నుంచి జరుగుతుందన్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని దీనిని ఎస్టీయూ ఖండిస్తుందని, ఉపాధ్యాయుల పట్ల కక్ష పూరిత ధోరణితో కాకుండా సామరస్య పూర్వకంగా ఆలోచించాలని లేకుంటే ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు



పెదఅమిరంలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

కాళ్ల: ప్రజల రక్షణ కోసం నిరంతరం కష్టపడే పోలీసు సిబ్బందికి ఆరోగ్యం చాలా కీలకమని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. మండలంలోని పెదఅమీరంలోని మిత్రా మెడికేర్ హాస్పిటల్‌లో పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వుల మేరకు ఈ మెగా ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న మొత్తం 1297 మంది పోలీసు సిబ్బంది వైద్య పరీక్షల నిర్వహణకు సహకారం అందించిన మిత్రా మెడికేర్ హాస్పిటల్, వర్మ హాస్పిటల్, తణుకులోని యాపిల్ హాస్పిటల్, పాలకొల్లులోని న్యూ లైఫ్ ఎమర్జెన్సీ అండ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వివిధ విభాగాలలో వైద్య పరీక్షలకు హాజరైన సిబ్బందికి అందుతున్న సౌకర్యాలను పరిశీలించి, వైద్య బృందానికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, మిత్రా మెడికేర్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ విక్రాంత్ చుండూరి, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎంవీవీ సత్యనారాయణ, భీమవరం డీఎస్పీ ఆర్.జయసూర్య, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అహ్మదున్నీషా తదితరులు పాల్గొన్నారు.

భీమవరం: భీమవరంలో ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని సోమవారం ఎస్పీ నయీం అస్మి ప్రారంభించారు. అనంతరం ఎస్పీ అద్నాన్ నయీం అస్మి స్వయంగా వివిధ విభాగాల్లో వైద్య పరీక్షలకు హాజరైన సిబ్బందికి అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ మారిన జీవన విధానంలో ఎక్కువగా వస్తున్న గుండె సంబంధిత వ్యాధులను ముందుగానే గుర్తించి తగిన చికిత్స చేయించుకోవాలన్నారు.

ఏలూరుపాడులో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన



ఏలూరుపాడులో పర్యటిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం

కాళ్ల: ఏలూరుపాడులో స్వచ్ఛసర్వేక్షణ్ కేంద్ర బృందం సోమవారం పర్యటించింది. ఈసందర్భంగా గ్రామంలోని ఆలయాలు, స్కూళ్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుద్ధ్య పరిస్థితి, మురుగునీటి పారుదల, పచ్చదనం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం కేంద్ర బృందం జిల్లా టీమ్ లీడర్ ఎం.మధుమతి గ్రామంలో పలు గృహాలను పరిశీలించారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి, ఇంటి పరిసరాలు, ఇంటి ఆవరణలో కూరగాయల పండ్ల పెంపకం వంటి అంశాలపై సర్వే చేశారు. గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంను పరిశీలించారు. సర్పంచ్ బీహెచ్ జగ్గరాజు, స్వచ్ఛ సర్వేక్షణ్ బృంద సభ్యులు టీవీ రవికిరణ్, ఎం.సంతోష్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో ఎంవీ.భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.అరుణాదేవి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఫణి, డీపీఆర్సీ ఎడ్వర్డ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశుగ్రాసం సాగు ప్రోత్సాహక పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

పాలకోడేరు: పశుగ్రాసం సాగు ప్రోత్సాహక పథకానికి సన్న, చిన్నకారు రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ టి.హేమ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి పశువులు కలిగి, నీటి వసతి, సొంత భూమి గల సన్న చిన్న కారు రైతులు అర్హులన్నారు. ఈ పథకంలో 10 నుంచి 50 సెంట్ల వరకు బహు వార్షిక పశుగ్రాసం సాగు చేసుకోవచ్చన్నారు. అర్హులైన సన్న చిన్నకారు రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుబుక్, బ్యాంకు ఖాతా, ఎన్‌ఆర్‌ఈజీఎస్ జాబ్ కార్డ్ జిరాక్స్‌లతో పశుసంవర్థక శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ పథకానికి కూలీల వేతన ఖర్చు, మెటీరియల్ ఖర్చు నిమిత్తం 10 సెంట్లకు రూ.6,599, 20 సెంట్లకు రూ.13,197, 30 సెంట్లకు రూ.19795, 40 సెంట్లకు రూ.26,394, 50 సెంట్లకు రూ.32,992 చొప్పున ప్రభుత్వం కేటాయించిందన్నారు. అర్హులైన పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అల్లూరి పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం



కుముదవల్లి గ్రంథాలయంలో అల్లూరి స్మారక చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

పాలకోడేరు: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కందుకూరి వీరేశలింగ కవి సమాజ గ్రంథాలయ చైర్మన్ భూపతిరాజు శ్రీనివాసరాజు అన్నారు. కుముదవల్లి గ్రామంలోని గ్రంథాలయానికి సోమవారం మోగల్లు అల్లూరి స్మారక సంస్థ సౌజన్యంతో అల్లూరి చిత్రపటాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ తెలుగు జాతి పౌరుషానికి ప్రతీకగా నిలిచిన అల్లూరి పోరాట స్ఫూర్తిని, అణగారిన వర్గాలకు అండగా నిలిచే తత్వాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. గ్రంథాలయ కార్యదర్శి నాగేంద్ర వర్మ, పాలకోడేరు మండల బీజేపీ అధ్యక్షుడు బుద్దరాజు బలరామరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మోగల్లు అల్లూరి స్మారక సంస్థ సభ్యులు 37 స్కూల్స్, గ్రంథాలయాల్లో అల్లూరి చిత్రపటాలను అందించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పోటీలను నిర్వహించారు.

పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం అర్బన్: పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పంటల బీమా పథకానికి రూ 210 ప్రీమియం చెల్లించాలన్నారు. రైతులకు సాగులో ప్రకృతి వైపరీత్యాలు వల్ల నష్టం కలిగితే ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సంస్థ నష్టపరిహారాన్ని అందజేస్తుందన్నారు. వ్యవసాయ భూమి కలిగిన రైతులు, కౌలు రైతులు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. రైతులు, కౌలు రైతులు ధ్రువీకరణ పత్రాల జిరాక్సులతో వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందిని కాని రైతు సేవా కేంద్రాలలో సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి



విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న గొర్తి ఈశ్వర్ ట్రస్ట్ ప్రతినిధులు

ఉండి: ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన ఉండి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి గ్రంధి లక్ష్మీనారాయణ శ్రీయశ్వంత్‌కు గొర్తి ఈశ్వర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గొర్తి ఉషాబాల పవన్ కుమార్ ప్రోతాహక బహుమతిగా రూ.15 వేలు అందజేశారు. ట్రస్ట్ కోఆర్డినేటర్ పెనుమాక భానుమూర్తి మాట్లాడుతూ ట్రస్ట్ స్థాపించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా 575 మార్కులు వచ్చిన వారికి రూ.25 వేలు, 500 నుంచి 574లో మార్కులు వచ్చిన విద్యార్థులకు రూ.15 వేలు, 499 మార్కులు లోపు వచ్చిన విద్యార్థులకు రూ.10 వేలు చొప్పున అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్, హైస్కూల్ హెచ్‌ఎం వై రామలక్ష్మీ, కే శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వేదికకు 4 ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు ఫిర్యాదులు అందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు సోమవారం చెప్పారు. స్థానిక పీపీ రోడ్డులో శిథిలావస్థకు చేరిన నాలుగు అంతస్తుల భవనం తొలగించాలని స్థానిక వ్యాపారి చుక్కా సత్యనారాయణ, మరికొందరు కలిసి వినతిపత్రం అందించారు. అలాగే స్థానిక ధర్మాపుర అగ్రహారంలోని తన భూమిని కబ్జాచేసి అనుభవిస్తున్నారని, సరిహద్దుదారులు దోనెపాటి సత్యనారాయణ, కొల్లాబత్తుల లేయమ్మ సర్వేకు సైతం అడ్డుతగులుతున్నారని, మండల సర్వేయర్‌తో సర్వే చేయించి, తగు చర్యలు తీసుకోవాలని కోళ్లపర్తి సుబ్రహ్మణ్య దత్తు ఫిర్యాదు చేశారు. జాతీయరహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయాలని వర్తినీడి వీర వెంకట సత్య శ్రీరామ చంద్రమూర్తి అర్జీ అందజేయగా స్థానిక సీహెచ్‌సీలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని, చర్యలు తీసుకోవాలని శ్రీరామచంద్రమూర్తి అర్జీలో కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమవరం డివిజన్

90102 23729

90108 51166

Office mail : tpgadvt@gmail.com